క్లుప్తంగా

పక్కాగా సర్వేలు చేపట్టాలి


సర్వేను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో రమణ

జి.సిగడాం: స్వామిత్వ భూసర్వేను పక్కాగా చేపట్టాలని శ్రీకాకుళం డివిజనల్ పంచాయతీ అధికారి ఐ.వి.రమణ సూచించారు. మండలంలోని గొబ్బూరు గ్రామంలో జరుగుతున్న సర్వేను సోమవారం పరిశీలించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం గ్రామంలో పొడిచెత్త, తడిచెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. పారిశుద్ధ్యంపై ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ధర్మవరపు సతీష్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మాచర్ల గోపాలం తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం


వృద్ధులకు ఆహార ప్యాకెట్లు అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి వి.విజయకుమార్ తన కుమార్తెలు హర్షిత, వర్షితల కోరిక మేరకు సోమవారం గొంటివీధిలోని నైట్ షెల్టర్ వృద్ధులకు అన్న వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ నగరంలో పలు ముఖ్య కూడళ్లతోపాటుగా నైట్‌షెల్టర్‌లో చేస్తున్న సేవలను చూస్తున్నామని, తన కుమార్తెల కోరిక మేరకు ఇక్కడ అన్నదాన కార్యక్రమం నిర్వహించానని పేర్కొన్నారు. కార్యక్రమంలో సామాజిక సేవకుడు ఉర్లం శివతేజ తదితరులు పాల్గొన్నారు.

నిరసనకు సంఘీభావం


సంఘీభావం తెలుపుతున్న డీసీసీ అధ్యక్షుడు కృష్ణారావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: న్యాయపరమైన సమస్యల పరిష్కారం కోరుతూ గత నాలుగు రోజులుగా కలెక్టరేట్ సమీపంలో జ్యోతీరావు పూలే పార్కు వద్ద కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు నిరసన చేపడుతున్నారు. దీంతో వీరికి డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు సోమవారం సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం వీరిని నిర్లక్ష్యం చేయడం బాధాకరమన్నారు. ఆయనతో పాటు నరసన్నపేట ఇన్‌చార్జి మామిడి సత్యనారాయణ, డీసీసీ ప్రధాన కార్యదర్శి ఇజ్జురోతు రమణ తదితరులు ఉన్నారు.

క్యాంపస్ డ్రైవ్‌లో హవా


విద్యార్థినులతో బీఎస్ చక్రవర్తి తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: వివిధ క్యాంపస్ డ్రైవ్‌లలో కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు సత్తాచాటారని ఆ విద్యాసంస్థల జిల్లా డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్ పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరంలో డిగ్రీ పట్టా అందుకోకముందే 500 మందికి పైగా విద్యార్థినులు ఉద్యోగాలు సాధించడంపై కళాశాలలో సోమవారం అభినందన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ ఎన్.సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కాలువ నిర్మాణంలోనూ వివక్షే


నిలిపివేసిన కాలువ నిర్మాణం

ఎచ్చెర్ల: వీధి కాలువ నిర్మాణంలోనూ కూటమి నాయకులు వివక్ష చూపుతున్నారు. లావేరు మండలంలోని కొత్తకుంకాం పంచాయతీ కొండకుంకాం గ్రామంలో వీధి కాలువ నిర్మాణాన్ని చేపట్టారు. కాలువ వెడల్పుగా నిర్మించాల్సి ఉన్నా 9 ఇంచుల వెడల్పుతో నిర్మించడమే కాకుండా, కాలువ చివరిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త పెరుమాళ్ల రమణ ఇల్లు, స్థలం ఉండడంతో అక్కడితో నిలిపివేశారు. ఈ విషయంపై రమణ సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు.

యూట్యూబర్‌పై ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాకేంద్రంలోని న్యూకాలనీలో ఒక విద్యాసంస్థ నడుపుతున్న సనపల శంకరరావు అనే వ్యక్తిని ఓ యూట్యూబర్ (జర్నలిస్టు) రూ.2 లక్షల కోసం బెదిరించినట్లు అతడు ఎస్పీ గ్రీవెన్స్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. తన పేపరు, టీవీకి ఖర్చులవుతున్నాయని చెప్పి రూ.2 లక్షలు అడిగారని, ఇవ్వకపోవడంతో అడ్మిషన్ల సమయంలో తప్పుడు కథనాలు రాశారని పేర్కొన్నారు.

ప్రమాణాలతో ప్రతిఫలం


మామిడికాయలు కాసిన చెట్టు

- మార్కెట్లోకి జోరుగా మామిడి
- కృత్రిమంగా పక్వానికి తీసుకొస్తే ప్రమాదం
- రైతులు ప్రమాణాలు పాటించాలని సూచనలు


మామిడి పండ్లు

ఎచ్చెర్ల: మామిడి సీజన్ జోరందుకుంది. పలు మార్కెట్లలోకి మామిడి పండ్లు పెద్ద ఎత్తున వస్తున్నాయి. మామిడి కాయలను కోయడం, పక్వానికి తీసుకు రావడంలో రైతులు, వ్యాపారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఆరోగ్యకరమైన పద్ధతుల్లో పక్వానికి తీసుకొస్తే రైతులకు లాభాలతో పాటు వినియోగదారులకు ఆరోగ్యం లభిస్తుంది. ఎచ్చెర్ల నియోజకవర్గంలోని ఎచ్చెర్ల మండలంలో 704, రణస్థలం మండలంలోని 1,487, లావేరు మండలంలో 141 ఎకరాల్లో మామిడి సాగు జరుగుతోంది. మామిడి కాయలు కోయడం, కాయను నిల్వ చేసే విధానంపై వ్యవసాయ అధికారులు పలు సూచనలు అందిస్తున్నారు.

మామిడికాయలు కోసే పద్ధతి

మామిడి పిందె ఏర్పడిన తర్వాత పూర్తిగా పక్వానికి రావడానికి 120 నుంచి 150 రోజుల సమయం పడుతుంది. కాయ లోపలి భాగం పసుపు రంగులోకి మారిన తర్వాతే వాటిని కోయాలి. కాయలను 10 సెంటీమీటర్లు తొడిమి ఉండేలా దోనేతో కోయాలి. కోసిన తర్వాత సొన (జీడి) పూర్తిగా కారేంత వరకు కాయలను కిందనే ఉంచాలి. ముదిరిన కాయలను ఉదయం 10 గంటల్లోపు, సాయంత్రం 5 గంటల తర్వాత కోసి ఆరబెట్టాలి. సొన (జీడి) కాయలను తొడిమివైపు ఉంచాలి. అవకాశం ఉంటే కాయలను మంచినీటిలో శుభ్రం చేస్తే మంచిది. ఆ నీటిలో టీపాల్ లేక సాండోవిట్ కానీ ఒక ఎంఎల్ కలిపి వాటిలో ముంచి ఆరబెట్టాలి.

గ్రేడింగ్ చేసే విధానం

కాయ బరువు బట్టి మూడు విధాలుగా గ్రేడింగ్ చేయవచ్చు. 200 నుంచి 250 గ్రాముల బరువు ఉన్నవాటిని ఒక గ్రేడ్‌గా, 300 నుంచి 350 గ్రాముల బరువు ఉన్నవాటిని ఇంకో గ్రేడ్‌గా, మిగిలిన వాటిని మరో గ్రేడ్‌గా తయారు చేసుకోవాలి.

మామిడిలో పోషకాలు

పండ్లలో మామిడి పండు రారాజు వంటిది. మామిడిలో అత్యంత విలువైన పోషకాలు ఉంటాయి. ఇందులో విటమిన్-సీ 76 శాతం, విటమిన్-ఏ 25 శాతం, విటమిన్-బీ 6 శాతం, ఇతర విటమిన్లు 11 శాతం ఉంటాయి. అదేవిధంగా ఈ పండ్లలో ఫైబర్ 9 శాతం, రాగి ధాతువు 9 శాతం, పోటాషియం 7 శాతం, మెగ్నీషియం 4 శాతం ఉంటాయి.

నిల్వచేసే విధానం

మామిడిని శీతలీకరణ గిడ్డంగుల్లో 10 నుంచి 12 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వద్ద 80 నుంచి 90 శాతం తేమలో దాదాపు 30 రోజుల నిల్వ ఉంచవచ్చు. బాగా పక్వానికి వచ్చిన మామిడి కాయలు 5 నుంచి 6 రోజుల్లో ముగ్గుతాయి. బాగా ముదిరిన కాయలను ఇళ్లలోనే గాలి చొరబడకుండా వరిగడ్డి వేసి ముగ్గబెట్టుకోవచ్చు. ఇందుకు వెదురు బుట్టలను ఉపయోగించుకుంటే మంచిది. 10 ఎంఎల్ ఇథైల్, 2 గ్రాముల సోడియం హైడ్రాక్సైడ్‌ను 5 లీటర్ల నీటిలో కలిపి వెడల్పు మూతిగల పాత్రలో ఉంచి మామిడి కాయలు ఉన్న గదిలో ఉంచితే ఒక రోజులో కాయలు ముగ్గుతాయి. మామిడి కాయల గదిలో బొప్పాయి, అరటిపండ్లను ఉంచితే అవి ఇథైల్ వాయువు వదలడంతో కాయలు త్వరగా మాగుతాయి.

కార్బైడ్‌తో ప్రమాదం

కాల్షియం కార్బైడ్‌తో పండ్లను పక్వానికి తీసుకొస్తే అనేక ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయి. దీని నుంచి ఎసిటిలిన్ అనే రసాయనం మెదడుకు ఆక్సిజన్ అందకుండా చేస్తుంది. కొంత మంది రైతులు మామిడికాయలు ముగ్గబెట్టడానికి కాల్షియం కార్బైడ్‌ను అధికంగా ఉపయోగిస్తున్నారు. ఇలా ముగ్గబెట్టిన కాయలకు మంచి రంగు ఉంటుందే కానీ రుచి ఉండదు. ఇవి పుల్లగా ఉంటాయి. పైగా ఇవి తింటే అనారోగ్యం పాలవుతారు. – మహేష్‌నాయుడు, వ్యవసాయ అధికారి, లావేరు

ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించేందుకు కుట్ర..?


సమావేశానికి హాజరైన ఉపాధి వేతనదారులు

శ్రీకాకుళం రూరల్: మండలంలోని రాగోలు పంచాయతీ పరిధి రాయిపాడు, బావాజీపేట, రాగోలుపేట క్లస్టర్‌కు సంబంధించిన ఫీల్డ్ అసిస్టెంట్‌ను రాజకీయ కక్షతో కూటమి నేతలు తొలగించేందుకు కుట్రలు పన్నుతున్నట్లు తెలుస్తోంది. గత 18 ఏళ్లుగా ఎటువంటి ఫిర్యాదు లేకుండా ఉపాధి కూలీల మన్ననలు పొందుతూ ఫీల్డ్ అసిస్టెంట్ మల్లేశ్వరి పనిచేస్తోంది. అయితే ఇటీవల కాలంలో కొందరు కూటమి నేతలు ఆకాశరామన్న పేరిట కొన్ని లేఖలను మండలంలోని ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయానికి పంపించారు. అయితే వాటిపై సదరు అధికారులు ఫీల్డ్ అసిస్టెంట్ వివరణ కూడా తీసుకోవడం జరిగింది.

విచారణకు డుమ్మా కొట్టిన అధికారులు

ఇదిలా ఉండగా ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ చేసేందుకు సోమవారం రాగోలు జిల్లా పరిషత్ పాఠశాలలో స్థానిక సర్పంచ్ అధ్యక్షతన ఉపాధి వేతనదారులతో కలిసి మండుటెండలో సమావేశం నిర్వహించారు. అయితే ఈ సమావేశానికి రావాల్సిన ఏపీడీవో, ఏపీవోలు డుమ్మా కొట్టారు. దీంతో విసుగుచెందిన వేతనదారులంతా అసహనం వ్యక్తం చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ పనితీరు బాగుందని, ఆమెను తొలగించాల్సిన అవసరం లేదన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ గేదెల శంగల్వరావు కలుగజేసుకొని ఫీల్డ్ అసిస్టెంట్ పనితీరు బాగులేకపోతే కొత్తవారిని ఎంపిక చేస్తామన్నారు. ఇంతలో కొంత మంది వేతలదారులంతా లేచి ఒకవేళ ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగిస్తే ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

రాజకీయ కక్షతో ఫిర్యాదులు

నేను ఫీల్డ్ అసిస్టెంట్‌గా గత 18 సంవత్సరాలుగా పనిచేస్తున్నాను. ఎటువంటి అవినీతి ఆరోపణలు నా మీద లేవు. నా మీద మా గ్రామానికి చెందిన కొందరు రాజకీయ కక్షతోనే ఇటీవల మూడుసార్లు ఫిర్యాదులు చేశారు. అధికారులు సైతం దర్యాప్తు కూడా చేయడం జరిగింది. – మల్లేశ్వరి, ఫీల్డ్ అసిస్టెంట్

విజేతలకు బహుమతులు అందజేత


విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్

రణస్థలం: మండలంలోని అర్జునవలస పంచాయతీ గిరివానిపాలెం గ్రామదేవత బంగారమ్మ తల్లి పండుగ మహోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసినటువంటి లక్కీ డ్రా విజేతలకు ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ బహుమతులు అందజేశారు. 10 విభాగాల్లోని లక్కీ డ్రాలో గెలిపొందిన విజేతలకు బహుమతులు నగదు రూపంలో అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీ రామినాయుడు, గ్రామ పురోహితులు, గ్రామ పెద్దలు, యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి


నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

శ్రీకాకుళం రూరల్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఏపీటీఎఫ్ జిల్లా శాఖ సభ్యులు నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వం ఎలిమెంటరీ పాఠశాలలను మూసివేసే దిశగా చర్యలు చేపట్టడం దారుణమన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో విద్యారంగం తీవ్ర ఒత్తిడికి గురవుతోందని, ప్రభుత్వాలు మారినా విద్యారంగ సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లాశాఖ అధ్యక్షుడు మజ్జి మదన్మోహన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి, దాసరి రామ్మోహన్‌రావు, పి.నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తిని పాటించండి

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రాథమిక తరగతులున్న అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తి సరిపోయేలా నిర్ణయాలు తీసుకోవాలని ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఎస్టీఏ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సప్పటి మల్లేసు, పంచాది గోవిందరాజులు ప్రభుత్వానికి సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ప్రాథమిక తరగతుల బోధనకు, మిగిలిన ఫౌండేషన్, బేసిక్ ప్రైమరీ పాఠశాలల్లో బోధనకు ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తిలో తేడాలు ఉండేలా సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను కేటాయించడం సరికాదన్నారు. ఇటువంటి విధానాలు అమలు చేయడం వల్ల ఫౌండేషన్ స్కూల్స్, బేసిక్ ప్రైమరీ పాఠశాలలు నిర్వీర్యమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఉన్నత పాఠశాలలో నలభై ఐదు మందికి ఒక సెక్షన్‌గా పరిగణించాలని, స్కూల్ అసిస్టెంట్‌లను కేవలం ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలకు కేటాయించాలని, ప్రాథమిక పాఠశాలకు పీఎస్ హెచ్‌ఎం పోస్టులను పదోన్నతల ద్వారా ఎస్జీటీలతో భర్తీ చేయాలని కోరారు.

ఘనంగా హనుమత్ కల్యాణం


అభినయ నృత్య నికేతన్ చిన్నారుల ప్రదర్శన

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో శ్రీరామనామ దశకోటి మహాయజ్ఞం, శ్రీహనుమాన్ చాలీసా కోటి పారాయణ మహాయజ్ఞ పూర్ణాహుతి మహోత్సవాల సందర్భంగా సోమవారం ఘనంగా సువర్చలా సమేత ఆంజనేయ కల్యాణం జరిగింది. హనుమత్ ఉపాసకులు అన్నదానం చిదంబరశాస్త్రి, నిరంతర రామసేవకులు ఉలిమిరి వెంకట సోమయాజులు ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ఈ కల్యాణ వేడుకల సందర్భంగా అయోధ్య నుంచి తెచ్చిన వెండి ధనస్సు ప్రదర్శన చేశారు. అలాగే సుందరాకాండ హవనం, ఆవాహిత స్వ దేవతా మంత్ర హవనం, పూర్ణాహుతులు జరిగాయి. అనంతరం అభినయ నృత్య నికేతన్ గురువు కె.నీరజా సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. కార్యక్రమంలో భాస్కరభట్ల శ్రీరామశర్మ, పీవీ రమణమూర్తి, విశ్వనాథం కామేశ్వరరావు, కనుగుల సత్యం, బందారు వెంకటలక్ష్మి, నేరెళ్ల విజయలక్ష్మి, వెంకటలక్ష్మి, కె.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం


పూర్ణాహుతి నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మంగువారితోటలో వేంచేసిన సంపత్ వినాయక దేవాలయం ఆలయ వార్షికోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అర్చకులు బంకుపల్లి కామేశ్వర సుబ్బారావు భుక్త ఆధ్వర్యంలో అభిషేకాలు, అలంకరణలు, లక్ష్మీగణపతి హోమం, మృత్యుంజయ హోమం, పూర్ణాహుతిలు జరిగాయి. అనంతరం ఆలయ శాశ్వత ధర్మకర్త కొండా రాంబాబు మల్లారి దంపతుల చేతులమీదుగా అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, మాజీ కౌన్సిలర్ పిల్లల నీలాద్రి, బుక్కూరు ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాలువ మరమ్మతులు ప్రారంభం


కాలువ మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలానికి సాగునీరు అందించే ప్రధాన సాగునీటి వనరు నారాయణపురం కుడి కాలువ మరమ్మతులను ఎట్టకేలకు అధికారులు సోమవారం ప్రారంభించారు. ఇటీవల రైతులు, ప్రజాప్రతినిధుల ఫిర్యాదుల మేరకు చర్యలు తీసుకున్నారు. ఈ కాలువపై ఆధారపడి రాజాం నియోజకవర్గంలోని సంతకవిటి మండలంలో 4,221 ఎకరాలు, ఆమదాలవలస నియోజకవర్గంలోని పొందూరులో 6,967 ఎకరాలు, ఎచ్చెర్లలో 7,175 ఎకరాల సాగు భూమి ఉంది. అయితే ఇటీవల కాలంలో కాలువ నుంచి సక్రమంగా సాగునీరు అందకపోవడంతో ఖరీఫ్‌లో పంటలు ఎండిపోయాయి. కాలువ పరిస్థితి ఇంజినీరింగ్ అధికారులు దృష్టికి తీసుకెళ్లినట్లు నారాయణపురం ఆయకట్టు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ సనపల ఢిల్లీశ్వరరావు, వైస్ చైర్మన్ పంచిరెడ్డి కృష్ణారావులు తెలిపారు. పూర్తిస్థాయిలో మరమ్మతులు నిర్వహిస్తేనే సాగునీరు వచ్చే అవకాశం ఉంటుందన్నారు.

11న శూద్రగంగ కావ్యగాన సభ


మాట్లాడుతున్న అట్టాడ అప్పలనాయుడు

శ్రీకాకుళం కల్చరల్: ప్రసిద్ధ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ రచించిన శ్రీశూద్రగంగ కావ్యగాన సభ ఈనెల 11వ తేదీన సాయంత్రం 5.30 గంటలకు బాపూజీ కళామందిర్‌లో నిర్వహించనున్నట్లు సాహితీ స్రవంతి, శ్రీకాకుళ సాహితీ ప్రతినిధులు కేతవరపు శ్రీనివాస్, అట్టాడ అప్పలనాయుడులు తెలిపారు. సోమవారం ఉదయం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో వివిధ ప్రజా సంఘాలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. సభను జయప్రదం చేసేందుకు అన్నివిధాలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. శ్రీశూద్రగంగ కావ్యం నేటి సమాజ స్థితిగతులను, కుల, మత పరమైన అణచివేతల్ని ఎత్తి చూపి పరిష్కారం వైపుగా ప్రజలను కదిలించే శక్తివంతమైన కావ్యమన్నారు. సమావేశంలో వివిధ సంఘాల ప్రతినిధులు బమ్మిడి శ్రీరామ్మూర్తి, బడియా కామరాజు, దొంతం పార్వతీశం, కె.నాగమణి, ఎం.గోవర్ధనరావు, కె.గణపతి, మిస్కా కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

శేషజీవితం సాఫీగా సాగిపోవాలి


మాట్లాడుతున్న మేనేజర్ అమరసింహుడు

శ్రీకాకుళం అర్బన్: విశ్రాంత ఉద్యోగుల శేషజీవితం సాఫీగా సాగిపోవాలని ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ హనుమంతు అమరసింహుడు ఆకాంక్షించారు. విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం రాత్రి ఆ అసోసియేషన్ మూడో వార్షికోత్సవ సమావేశం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె.శంకరరావు (సుమన్) అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఆర్టీసీ శ్రీకాకుళం-1 డిపో మేనేజర్ హనుమంతు అమరసింహుడు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ కార్యాలయంలో మూడో వార్షికోత్సవం నిర్వహించుకోవడం శుభపరిణామమన్నారు. ఎన్ఎంయూ నాయకుడు వై.అప్పయ్య, ఈయూ నాయకులు జి.త్రినాథ్‌లు మాట్లాడుతూ సంస్థలో పరిస్థితులు గురించి, విశ్రాంత ఉద్యోగుల సంఘానికి తాము సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ రాష్ట్ర అధ్యక్షుడు ముత్యాలు, విశ్రాంత రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ఎస్ఆర్ శర్మ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.అప్పారావు, అతిథులుగా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.పెంటయ్య, సలహాదారు పి.భాస్కరరావు, పాలకొండ కార్యదర్శి ఆర్.రామారావు, అధ్యక్షులు బి.గౌరు, పకీర్, ఏపీ రమణ, టెక్కలి రామారావు, చిన్నారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఫ్యాన్‌లు వితరణ


ఆర్టీసీ అధికారులకు ఫ్యాన్‌లు అందజేస్తున్న సాంబమూర్తి

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం నగరానికి చెందిన శ్రీకౌశిక్ జ్యూయలర్స్ మేనేజింగ్ డైరెక్టర్ పేర్ల సాంబమూర్తి ఆర్థిక సౌజన్యంతో ఏపీఎస్ ఆర్టీసీ శ్రీకాకుళం కాంప్లెక్స్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం 20 సీలింగ్ ఫ్యాన్లను వితరణ చేశారు. ఈ ఫ్యాన్‌లను సోమవారం శ్రీకాకుళం జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్ కుమార్‌కి ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా ప్రయాణికులకు ఉక్కపోత నుంచి ఉపశమనం కల్పించేందుకు ఈ ఫ్యాన్‌లను అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎస్‌కే జ్యూయలర్స్ స్టోర్స్ మేనేజర్ దానవేందర్, శ్రీకాకుళం-1, 2వ డిపోల మేనేజర్లు హనుమంతు అమరసింహుడు, కె.రవిశంకర్ శర్మ, ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల అసిస్టెంట్ మేనేజర్లు వి.రమేష్, ఎ.గంగరాజు, బస్‌స్టేషన్ మేనేజర్ ఎంపీ రావు, సుమన్, రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలి

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని కుశాలపురం పంచాయతీ వెంకటాపురం పరిధిలో నారాయణపురం కుడికాలువ గట్టు ఆక్రమణలకు గురవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. కాలువ గట్టుపై ఆక్రమణలు తొలగించాలని కోరారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బి.గోపాలరావు చెప్పారు.

ఉత్సవాలకు వేళాయె..!


నూకాలమ్మ తల్లి

- పదేళ్లకు జరగనున్న సిరిమాను ఉత్సవాలు
- సిద్ధమైన పాత శ్రీకాకుళం


నూకాలమ్మ తల్లి ఆలయం


ముస్తాబవుతున్న పెద్దమ్మ తల్లి ఆలయం

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలో గత 50 ఏళ్లుగా ప్రతీ పదేళ్లకు ఒకసారి జరగనున్న ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారాల మేరకు మంగళవారం నుంచి సిరిమాను ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు స్థానిక పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ ఉత్సవాలు 1985, 1995, 2005, 2015 సంవత్సరాల్లో జరిగాయన్నారు. ఈ ఏడాది మే 6న ప్రారంభించి జూన్ 10న ముగింపు జరుగుతుందని పేర్కొన్నారు. ముగింపు రోజున సిరిమానుల అనుపు ఉత్సవం జరుగుతుందని చెప్పారు. ఈ ఉత్సవంలో పాత శ్రీకాకుళంలో ఉన్న ముత్యాలమ్మ తల్లి, నక్కవీధిలోని నూకాలమ్మతల్లి, సంతోషిమాత కూడలి వద్దనున్న దుర్గమ్మతల్లి, మావూరు వీధిలోని పెద్దమ్మతల్లి, కొత్తపేటవద్ద ఉన్న సన్నాల పోలమ్మ తల్లి అమ్మవార్లకు సిరిమాను జరిగే 36 రోజుల పాటు విధిగా పూజలు జరుగుతాయని తెలిపారు. సమావేశంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు డీపీ దేవ్, ఎల్.రామలింగస్వామి, మావూరి శేఖర్, డాక్టర్ గుంపా శివప్రసాద్, నక్క శంకరరావు, కల్లేపల్లి సోంబాబు, కర్రి రంగాజీదేవ్, దేశేల్ల గోవిందుమల్లిబాబు, దండి రాజేంద్రదేవ్, ముప్పన శ్రీనివాసరావు, జి.పాపారావు, డి.తిరుమలరావు, జి.ఆదినారాయణ, ఎస్.గణేష్, ఎం.రమేష్, ఎ.రాంబాబు, తిరుమలరావు, సన్యాసి, జి.తాతారావు, జి.పెద్దరమణ, నక్క రామరాజు, జి.చిన్నారావు, పి.చంద్రశేఖరాచారి, ఎస్.గణేష్, కె.కోటేశ్వరరావు, జి.రాజు, కె.మణిశేఖర్‌దేవ్, అశ్వినీకుమార్, ఎస్.రవికుమార్, ఎల్.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సిరిమాను నిర్వహించే ప్రాంతాలు

ఈ సిరిమాను ఉత్సవం జిల్లా పరిషత్ నుంచి దేశేల్ల వీధి, నక్కవీధి, దండివీధి, సంతోషిమాత కూడలి, మావూరు వీధి, కలెక్టర్ బంగ్లా, హరిజన వీధి, బాదుర్లపేట, కొత్తపేట, కునుకుపేట వరకు వెళ్లి తిరిగి కుందనపుపేట మీదుగా జిల్లా పరిషత్ కూడలికి చేరుతుందని తెలిపారు. సిరిమాను ఊరేగింపు జరిగే ప్రాంతం సుమారు రెండున్నర కిలోమీటర్ల మేర సాగుతుందని తెలిపారు. ఉత్సవం చూసేందుకు లక్షల సంఖ్యలో భక్తులు వస్తుంటారని, చివరి రోజైన జూన్ 10న రెండు సిరిమానులు, వేషధారణలతో ఊరేగింపు నిర్వహించబడుతుందని తెలిపారు.

అమ్మవార్ల ఊరేగింపు, అనుపు తేదీలు

- మే 7న రాత్రి 9 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు దుర్గమ్మ అమ్మవారి దేవర.
- మే 15న మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు దుర్గమ్మ అనుపు ఉత్సవం.
- మే 21న రాత్రి 9 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు సన్నాల పోలమ్మ అమ్మవారి దేవర.
- మే 25న మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు సన్నాల పోలమ్మ అమ్మవారి అనుపు ఉత్సవం.
- జూన్ 2న రాత్రి 9 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు పెద్దమ్మతల్లి, నూకాలమ్మతల్లి అమ్మవార్ల దేవర.
- జూన్ 10న మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పెద్దమ్మతల్లి, నూకాలమ్మతల్లి అమ్మవార్ల సిరిమానుల అనుపు ఉత్సవం.
- జూన్ 11న ఉదయం 11 గంటల నుంచి భోజన కార్యక్రమం జరుగుతుంది.